# ఊర్మిళ నవ్వు

లక్ష్మణరావు కావాలని పట్టుపట్టి పల్లెటూరమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అతనికి చదువుకున్న అమ్మాయిలని చూసి చూసి (పెళ్ళి సంబంధాలకుపోయి) విసుగు పుట్టింది. అందులో మరీ వో అమ్మాయి, అతగాడి ముఖం మీదే "నువు నాకు నచ్చలేదు" అని చెప్పింది. అతగాడి ప్రాణం చివుక్కుమంది. ఎంతచెడ్డా తను లక్షరూపాయల ఆస్తిమంతుడు. చదువు సరిగా అంటక పోయినా రూపానికి లోటు లేదు. పురుషలక్షణమైన ఉద్యోగం వుంది. కరిణీకం వుద్యోగం కాదా యేమిటి?

ఆ అమ్మాయి పేరు ఊర్మిళ అని వినగానే లక్ష్మణరావు మనసు ఎగిరి గంతేసింది. తాను ఇన్నాళ్ళు ఇంతమందిని చూసినా, వొక్కరినీ తాను వరించటానికి వీలులేని పరిస్థితులు కల్పించబడటం తనకు ఊర్మిళ దక్కటానికేమో, అనుకున్నాడు. ఊర్మిళకోసం తాను ఇన్నాళ్ళనుంచీ తపస్సుచేస్తున్నాడు, అనుకున్నాడు. అమ్మమ్మకు ఆ అమ్మాయి ఇంత నచ్చిందని చెప్పలేము. సంపూర్తిగా నచ్చింది. ఊర్మిళని చూడగానే అమ్మమ్మకు తన చిన్నతనం జ్ఞాపకానికొచ్చింది. కాళ్ళకు కడియాలూ, మెళ్ళోపులిచేరునానూ, జడమీద నాగరం, ఇవన్నీ చూచి వచ్చిన అమ్మమ్మ "ఒరే అబ్బీ! మన ఇంట్లో దీపం అవసరంలేదు. నట్టింట్లో ఆ పిల్లనడిస్తే, ఇల్లంతా పెట్రోమాక్సులైటే!" అంది.

"పిట్రోమాక్స కాదమ్మమ్మా, పెట్రోమాక్స" అన్నాడు లక్ష్మణరావు.

"యేదైనా వుతేరా గాడిదీ, ఇక నాకేం నేర్పుతావు. వచ్చే ఆపిల్లకు నేర్పుకుందువుగానిలే!" అన్నది అమ్మమ్మ. లక్ష్మణరావు మరి సిగ్గుపడిపొయ్యాడు. లక్ష్మణరావు దూరపుచుట్టాల్లో చదువుకున్న అమ్మాయిలున్నారు. వాళ్ళంతా వచ్చి "ఏమోయి లక్ష్మణా! ఆమెకు నిద్రపోవటమే పనిగాబోసు! నీ వేపేనాకన్నెత్తి చూస్తుందా" అన్నారు.

"ఎంతవరకు చదువుకుంది" అని అడిగారు

"బత్తెసంజనుంచి దూడగుంజవరకు" అన్నారు కొందరు. లక్ష్మణరావు మనసు చివుక్కుమనిపించింది. అయినా అతడి మనసులో అమ్మమ్మమాటలో తిరిగి గర్వరేఖ మెరిసింది.

పెళ్ళి సజావుగా సాగిపోయింది.

"ఊర్మిళ చదువుకోకపోతే మాత్రం, ఏంలోటు" అనుకున్నాడు లక్ష్మణరావు. అతడి మనస్సులో భవిష్యత్తు తీయని రాగాలు పాడింది.

పెళ్ళికూతురి పాతకాలపు రూపాన్ని చాలా మంది వెక్కిరించారు. చాలామంది నవ్వుకున్నారు. లక్ష్మణరావు రహస్యంగా ఆ అమ్మాయిని పలకరించబోయాడు. ఆ అమ్మాయి ఎంతగింజుకున్నా; చాలాసేపు మాట్లాడలేదు. చివరకు మాట్లాడింది.

"నీకస్సలు చదువురాదా, ఆ అలుకూడా రావా" అని అడిగాడు.

"ఎందుకురాదు. తెలుగు చదువు బాగా వొచ్చు" అంది అమ్మాయి.

మంజుశ్రీ

అదేనాకు వెలుగు. ఆ వెలుగు నాకుచాలు. అనుకున్నాడు లక్ష్మణరావు.

"ఏం చదువుకున్నావు?" అడిగాడు.

"రుక్మిణీ కళ్యాణం. గజేంద్రమోక్షం. లక్ష్మణదేవరనవ్వు, (ఆ అమ్మాయి నోరు ముయ్యబోయాడుతను) ఊర్మిళాదేవి నిద్ర (ఆ అమ్మాయి నవ్వుకొంది)"

"రైట్" అనుకున్నాడు లక్ష్మణరావు.

జేబులోంచి డైరీతీసి అందులో లక్ష్మణరావు అని వ్రాయమన్నాడు. ఆ అమ్మాయి సిగ్గుపడుతూ అతని చేతిలోంచి కలం తీసుకొని గుండ్రంగా రత్నాల్లాగా, వజ్రాల్లాగా, ముత్యాల్లాగా వ్రాసింది. లక్ష్మణరావు పరమానంద భరితుడయ్యాడు.

"ఇక్కడున్నావుటే ఊర్మిళా" అన్నారెవరో బయటినుంచి. ఆ అమ్మాయి పారిపోయింది.

ఆ అమ్మాయి వ్రాసిన తనపేరు క్రింద, ఆ అమ్మాయిపేరు తను వ్రాసి కలం వో జేబులోనూ, డైరీ ఓ జేబులోనూ పెట్టుకున్నాడు లక్ష్మణరావు.

నాగవల్లి పూర్తికాగానే అప్పగింతలకు కూర్చున్నారందరూ. బుక్కాగుండా గట్టిగా కొట్టేశాడు లక్ష్మణరావు. ఊర్మిళ తలవంచుకు కూర్చుంది.

అప్పగింతలు కూడా అయిపోయినయ్. ఇక గృహప్రవేశానికి బయలుదేరాలి. అక్కడినుంచి నాలుగుమైళ్ళు యెడ్లబండ్లమీద వెళ్ళాలి. అప్పటికి రైల్వేస్టేషన్ వస్తుంది. అక్కడ రైలు ఐదారు నిమిషాలకంటే ఎక్కువాగదు. అక్కడినుంచి లక్ష్మణరావు వాళ్ళ ఊరికి వోగంట ప్రయాణం. రైలుదిగి ఇంటికెళ్ళవచ్చు. స్టేషన్లో బళ్లు సిద్ధంగా వుంటాయి.

అలానే అనుకుని బయలుదేరారు.

తల్లితండ్రులు తనని లక్ష్మణరావు కప్పగిస్తుంటే వొకవైపు సంతోషమూ, వొకవైపు దుఃఖమూ ముంచేశాయి ఊర్మిళని. ఉక్కిరిబిక్కిరైపోయింది. చిన్ననాటినుంచి తనను పెంచిన మమత వాళ్ళను వీడకు ప్రేమ పెల్లుబికి కళ్లు కాల్వలైనాయి.

ఊర్మిళ బయలుదేరింది.

పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ, కూచున్న బండ్లో పెద్దలెవరూ ఎక్కలేదు. కుర్రసజ్జుకు వాళ్ళ బండిలో ప్రవేశం లభిస్తే అది ప్రత్యేకమైన పురస్కారంగా భావిస్తారు. పోటీలుపడి వాళ్ళ బండ్లో యెక్కారు.

బళ్ళు కదిలినయ్.



## ఇప్పుడే వెలువడినాయి:

| | రు. |
|---|---|
| నరుడు – అడివి బాపిరాజు | 2-0 |
| జాజిమల్లి ,, | 2-0 |
| మధుర తులికాలు – మూన్స | 1-75 |
| ప్రణయకలహం–మునిమాణిక్యం | -75 |
| చిలుకప్ప – పాలంకి | 1-00 |
| మత్స్య కన్యలు– కె. సభా | 1-00 |
| పరీక్షా ఫలితాలు– ,, | 1-00 |

వివరములకు:

కవితా పబ్లికేషన్స్

బిసెంటు రోడ్, విజయవాడ-2.




పైన గుడ్డివెన్నెల కాస్తున్నది. పొలాల మీదనించి పైరగాలి చక్కటి వాసనలు చిమ్ముతున్నది. లక్ష్మణరావు ఊర్మిళ వేపు చూశాడు. నిండానగలు దించుకుని కన్యాత్వశోభతో మెరిసిపోతున్నది ఊర్మిళ, పెళ్ళికూతురికి ఎక్కడలేని శోభా వస్తుంది. లక్ష్మణరావుకు హృదయంలో తీయని అనుభూతులు కదిలినై. జన్మసార్ధకమైందనుకున్నాడు. ఊర్మిళ కళ్ళు మూసుకుని బండి బల్లకు చేరగిలపడ్డది. క్రితం రాత్రి అంతా నిద్రలేదు. పగలంతా ఎదో తంతుతోనే సరిపోయింది. లక్ష్మణరావుకి వొళ్ళొంటె ఊహ మెరిసింది.

స్టేషన్ వచ్చేసింది. ఎక్కువ ఆలస్యం లేకుండా రైలుకూడా వచ్చేసింది. ఎక్కువ సేపు ఆగదు. అంతా ఖంగారుపడుతూ ఎవరిపీలునుబట్టి వాళ్ళు ఎక్కుతున్నారు. బలంకలవాళ్లు, శౌర్యం కలవాళ్ళు, సాహసులు, దర్పంకలవాళ్ళూ, సామాన్లు చేర వేయటంలో మునిగిపోయారు.

ఊర్మిళ చెయ్యి పట్టుకుని గబగబా లాక్కుపోయి ఓ పెట్టెలో ఎక్కించాడు. లక్ష్మణరావు 'మేమిక్కడ కూచున్నాం' అని చెప్పాడు. ఇంతలోనే రైలు కదిలింది. సాహసులైన వాళ్ళు రైలు కదిలిం తర్వాత యెక్కారు. వీళ్ళు కూచున్న పెట్టె జోలి ఎవరూరాలేదు. రైలు కదలగానే ఊర్మిళ తూగుతూ నిద్ర పోయింది. పెట్టెలో ఎక్కువమంది లేరు. వోమూలకూచుంది ఊర్మిళ. పక్కనే లక్ష్మణరావు కూచున్నాడు.

ఊరొచ్చేసింది. పెళ్ళివాళ్ళంతా దిగి ప్రత్యేకమైన బళ్ళలో యెక్కారు. లక్ష్మణరావు వొంటరిగా ఊర్మిళతో కలసి ఒకబండియెక్కాడు. సుబ్బారావుని కూడా రయెక్కనివ్వలేదు. బండి కదలగా, "నీనానుతాడు ఎంత బాగుందీ, నీ చంద్రహారం, భలేబాగుంది" అన్నాడు లక్ష్మణరావు, ఊర్మిళ మెడవేపు చూసుకుంది. ఊర్మిళకి గుండెలుపగిలిపోయాయి. "ఏమైనాయి, తన జిగిసీ గొలుసూ, నానుతాడూ, చంద్రహారం అత్తగారు తెచ్చిన జాజిపూల నెక్లెసూ బండ్లు అ పించండి" అంది రుద్ధకంఠాన. "అబ్బ! ఎంతమొద్దునిద్ర మీ వాళ్ళుపెట్టిన పేరు సార్ధకం చేసుకున్నావు" అన్నాడు లక్ష్మణరావు. జేబులోంచి చంద్రహారం తీశాడు. "ఒక్కొక్కటే వొలుస్తున్నా, మెలుకువరాలేదు" అన్నాడు. "అమ్మ! బతికిపోయాను. గుండెలాగి పోయాయండీ" అన్నది ఊర్మిళ బండ్లోనే అతని కౌగిలికి చేరిపోతూ. ★